## క్లుప్తంగా

### మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పొన్నూరు(చేబ్రోలు): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని ఎస్‌పీపీ రోడ్డులోని ముబారక్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ముబారక్ నగర్ ఆర్చ్‌ను శనివారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన ఆర్చ్‌ను రంజాన్ పండుగ సందర్భంగా ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఈ విధానంతో పండించిన ఆహార పదార్థాలను ఆహారంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి చింతా వరప్రసాద్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని రావిపాడు గ్రామంలో 2023–24 వార్షిక ప్రణాళికలో భాగంగా రైతులకు పలు కార్యక్రమాల గురించి వివరించారు. నవధాన్యాల సాగు వలన కలిగే లాభాల గురించి, భూమికి జరిగే ఉపయోగం గురించి, భూమిలో ఏర్పడే పోషకాలు, వాటి వలన ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతులు, గ్రామస్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

### మహమూదియ మసీదు నూతన కమిటీ



పాత గుంటూరు: 17వ డివిజన్ ఇందిరా ప్రియదర్శిని కాలనీ మూడోలైనులోని మహమూదియ మసీదు, ఈద్గా నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ జబీ నియామకమైనట్లు కమిటీ గౌరవ సలహాదారులు షేక్ అల్లాబక్షు తెలిపారు. శనివారం రంజాన్ ప్రార్థనల అనంతరం మసీదులో మత పెద్దల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాబక్షు మాట్లాడుతూ స్థానిక ముస్లింల ఆకాంక్ష మేరకు మసీదు, ఈద్గా అభివృద్ధికి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యదర్శిగా షేక్ చాన్ బాషా, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ జకర్రియ్యా, సంయుక్త కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రజాక్, కోశాధికారి షేక్ వాజిద్, మరో 12 మంది కార్యవర్గ సభ్యులతో కమిటీ ఏర్పడిందని అన్నారు. అనంతరం జబీ మాట్లాడుతూ మసీదు, ఈద్గా, మదరసాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం రూ. 2.50లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సభ్యులు షేక్. కరిముల్లా, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

### ధరిత్రీ పరిరక్షణ బాధ్యత అందరిదీ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ కన్నతల్లి వంటి భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. అనంతరం 300 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితా దేవి, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళి, సీపీటీ క్యాంపస్ ఇంచార్జ్ జి.సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఎన్‌సీసీ అధికారి పి.కుమార్ రాజా, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు గీతా మల్టీస్పెషాల్టీ(సత్తెనపల్లి) వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్పుల శివరామిరెడ్డి శనివారం తెలిపారు. గర్భకోశవ్యాధులు, ఎముకలు, కీళ్లు, సంతానలేమి వంటి వాటికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు**



పెదనందిపాడులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పుల్లడిగుంటలోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు

ప్రత్తిపాడు: ఇస్లాం కాలమానం ప్రకారం పవిత్రంగా భావించే రంజాన్ మాసం షవ్వాల్ నెలవంక దర్శనంతో రంజాన్ సంబరాలు ఆరంభమయ్యాయి. సమత, మమతలకు ప్రతీక అయిన రంజాన్ మాసంలో నెల రోజుల పాటు కఠిన నియమ నిష్టలతో, ప్రత్యేక నమాజ్‌లతో భక్తిశ్రద్ధలతో ముస్లింలు ఉపవాసదీక్షలు ఆచరించారు. శుక్రవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో శనివారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే మసీదులు, ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అల్లా తమకు అండా నిలవాలంటూ నిరుపేదలకు దానధర్మాలు చేశారు. ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూదన్న అల్లాహ్ మాటలను స్మరించుకుంటూ ఫిత్రా దానం చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడుతో పాటు పుల్లడిగుంటలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత్త పెద్దలు రంజాన్ సందేశాన్ని ఇచ్చారు.సయ్యద్ నూరుల్లా, షేక్ బిలాల్, సయ్యద్ అల్లాభక్షు, షేక్ నాగుల్‌మీరా, షేక్ కరిముల్లా, మతపెద్దలు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

**పెదనందిపాడులో..**

పెదనందిపాడు: భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ ప్రార్థనలు జరిగాయి. శనివారం ఉదయం పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెదనందిపాడు జుమ్మా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రంజాన్ పండుగ విశిష్టతను మౌలానా వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దానాలు చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

**పెదకాకానిలో...**

పెదకాకాని: రంజాన్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత పెద్దలు రంజాన్ పండుగ ప్రాధాన్యత, సారాంశాన్ని వివరించారు. ఖురాన్ పఠనం, నమాజ్ ముగిసిన అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

**కాకుమానులో..**

కాకుమాను: మండలంలోని గ్రామాలలో ముస్లింలు శనివారం రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక ఈద్గా వద్ద ఇమామ్ హిదయతుల్లా ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మత పెద్ద హిదయతుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అల్లాహ్ చూపిన మార్గంలో నడవాలని సూచించారు. మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు. కొమ్మూరులో రంజాన్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

## కరుణ, దాతృత్వానికి ప్రతీక రంజాన్



పొన్నూరులో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

**ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య**

పొన్నూరు(చేబ్రోలు): కరుణ, దాతృత్వం, సర్వ మానవ సమానత్వానికి, సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీక అని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలో శనివారం జరిగిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే కిలారి పాల్గొన్నారు. కఠోర ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ, సామూహిక ప్రార్థనలతో ధార్మిక చింతన, ఐకమత్యం, దానధర్మాలు, దాతృత్వం రంజాన్ పండుగ మానవాళికి అందించే సందేశమన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చేబ్రోలు, వడ్లమూడి, వేజండ్ల గ్రామాల్లో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

**పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**



తెలగపాలెంలో చలివేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చటం అభినందనీయమని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తెలగపాలెంలోని కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రంను శనివారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ద్వారా అందిస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలు ఆదర్శనీయంగా ఉన్నాయన్నారు. మంచి కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు తిరుమల శెట్టి ఉమాశంకర్‌ను అభినందించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, గుడివాడ పవన్, కోదండ రామాలయం అధ్యక్షుడు అల్లం సాంబయ్య, అమెరినేని సాంబశివరావు, దాసరి నారాయణరావు, గోపాలం అశోక్, చిల్లా అనిల్ పాల్గొన్నారు.

## జీవ వైవిధ్య సంరక్షణతోనే మానవ మనుగడ

**ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవ సభ**





ప్రపంచ ధరిత్రీ దినోత్సవ సభలో వీఆర్ జ్యోత్స్న కుమారి, సంతోషకుమారి, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవ వైవిధ్య సంరక్షణతోనే భూమిపై మానవ మనుగడ సాధ్యమని బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సంతోషకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా యువజన సర్వీసులశాఖ – స్టెప్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంతోషకుమారి మాట్లాడుతూ యువతరం ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రణను పాటించడం ద్వారా భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలని సూచించారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ పారిశ్రామిక విప్లవం అనంతరం పర్యావరణ పరిరక్షణ తద్వారా భూమిని, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడం పెను సవాలుగా మారిందన్నారు. ఈసందర్భంగా ప్రపంచ ధరిత్రీ దినోత్సవ ఉద్దేశాన్ని కళాజాతర ద్వారా కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ బి.రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, స్టెప్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, కేఎస్ఎస్సార్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పోరాటయోధుడు లెనిన్



పెదకాకానిలో లెనిన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పెదకాకాని: సీపీఐ ఆధ్వర్యంలో ప్రపంచ విప్లవకారుడు, ప్రప్రథమ సోషలిస్టు రాజ్యస్థాపకుడు కామ్రేడ్ వీఐ లెనిన్ జయంతి వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రమైన పెదకాకాని సీపీఐ కార్యాలయంలో శనివారం కామ్రేడ్ ఐవీ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కేతినేని అగస్టీన్ అధ్యక్షత వహించారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ వీఐ లెనిన్.. మార్క్స్ విప్లవ భావాన్ని అందిపుచ్చుకొని వారితో స్నేహాన్ని పెంపొందించుకొని రష్యాలో విప్లవాన్ని సాధించిన మహా యోధుడని కొనియాడారు. బండ్లమూడి శరత్ బాబు, షేక్ మస్తాన్‌వలి, రవి, గోపి, మధుమోహన్, కె.ప్రతాప్, తెల్లమేకల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**గొప్ప దార్శనికుడు లెనిన్**

పాత గుంటూరు: మార్క్సిస్టు సిద్ధాంతాన్ని తొలిసారిగా సోవియట్ యూనియన్‌లో అమలు జరిపి ఆచరణలో పెట్టిన గొప్ప దార్శనికుడు వి.ఐ.లెనిన్ అని, దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని సోవియట్‌లో అమలు జరిపిన ఘనత ఆయనకే దక్కుతుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం బ్రాడీపేట సీపీఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ 153వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక, నిత్యావసర సరుకుల ధరలు పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు మూర్తి, మోహన్‌రావు, శైలజ, మాధవరావు, శేషగిరి, సీపీఎం నాయకుడు వై.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడిలో రంజాన్ పండుగ సందర్భంగా ప్రీమియర్‌లీగ్ సీజన్–2 క్రికెట్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈపోటీల్లో పలుప్రాంతాల నుంచి వచ్చిన 9జట్లు పాల్గొనగా విజేతగా యాంగ్రీ టైగర్స్ జట్టు నిలిచింది, రన్నరప్‌గా రైజింగ్‌స్టార్ జట్టు నిలవగా విజేతలకు నరసరావుపేటకు చెందిన లైఫ్‌కేర్ ల్యాబ్ అధినేత షేక్.మొహిద్దీన్(బుజ్జి) రూ.10,116, ట్రోఫీ అందజేశారు. రన్నరప్ విజేతలకు ఖలీం రూ.5,116 బహుమతి అందజేశారు.

### ● నేడు ఏపీఆర్‌జేసీ మాక్ టెస్ట్

తెనాలిఅర్బన్: ప్రకాశం రోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల మాక్ టెస్ట్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు కోచింగ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు డైరెక్టర్ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారందరూ పాల్గొన వచ్చని తెలిపారు.

## నైపుణ్యాల వృద్ధితోనే ఉన్నతస్థానాలకు..

- సింక్రోణి ఇంటర్నేషనల్ సర్వీసెస్ సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ అలేఖ్య
- ఉద్యోగ కల్పనే లక్ష్యం : డాక్టర్ లావు రత్తయ్య
- విజ్ఞాన్ నిరులలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఘనంగా ఆత్మీయ సన్మానం



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న అలేఖ్య, విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటేనే ఉన్నత స్థానాల్లో నిలబడతారని సింక్రోణి సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ తటవర్తి లక్ష్మీ అలేఖ్య పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉండి వివిధ ఉన్నత సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పెదపలకలూరులోని కళాశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని సూచించారు. ఈ ఏడాది బీటెక్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థుల్లో సుమారు 400 మంది విద్యార్థులు వివిధ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు, అత్యధికంగా రూ.22లక్షల వేతనంతో ఒక విద్యార్థి అమెజాన్ సంస్థలో ఉద్యోగం పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక వెల్లడించారు. వీరి స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా వారి తల్లిదండ్రులకు కళాశాల ప్రాంగణంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ తమ సంస్థల్లో చదివే విద్యార్థులను ఉన్నత ఉద్యోగస్తులుగా, నైపుణ్యాలు కలిగిన వారిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ ఏడాది భారీ సంఖ్యలో ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్తుపై చూపిన శ్రద్ధకు, అందించిన శిక్షణ, నైపుణ్యాలపై విజ్ఞాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ సంస్థల ఉపాధ్యక్షుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో పరిపూర్ణ ఆనందం

**ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి**



వీరాంజనేయ స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కార్పొరేటర్ ఆచారి

గుంటూరు వెస్ట్: సంపూర్ణమైన ఆనందం, మనశ్శాంతి ఆధ్యాత్మికతతోనే లభిస్తాయని శాసన మండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. పరుశరామ జయంతి, అక్షయ తృతీయ వేడుకలను పురస్కరించుకుని శనివారం స్థానిక బ్రాడీపేలోని బడబానల ప్రతాప వీరాంజనేయ స్వామి దేవాలయంలో లక్షతమలపాకుల దళార్చన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజూ కొంత సమయం దైవారాధనకు కేటాయించాలన్నారు. ఆధ్యాత్మిక నిండిన మనస్సు చెడు ఆలోచనలకు తావివ్వదన్నారు. ఆలయ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, అయితి సతీష్, పీవీ భావన్నారాయణ, అర్చకులు కె.సాయి, అంబా శంకర శాస్త్రి, పాల్గొన్నారు.

### మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్య సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరండల్‌పేట 12/2 లో రామయోగిరెడ్డి అతని భార్య సంధ్యారాణి (22) నివసిస్తున్నారు. వీరికి 5 సంవత్సరాల క్రితం వివాహమైంది. రామయోగిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగి. దంపతులకు ఇద్దరు పిల్లలు. శుక్రవారం రాత్రి సంధ్యారాణి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సంధ్యారాణి తండ్రి నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రెండు మోటార్లు చోరీ

తాడేపల్లి రూరల్: మోటారు దొంగలు రెచ్చిపోయారు. శనివారం తెల్లవారుజామున రెండు విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్లారు. రైతులు ప్రకాష్ రెడ్డి, సోము తెలిపిన వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్‌టీఆర్ కరకట్ట నుంచి మహానాడు కరకట్టకు వెళ్లే మార్గంలో వున్న 40 అడుగుల రోడ్డులో పక్కపక్క పొలాల్లో మోటార్లు తీసుకెళ్లినట్లు చెప్పారు. శుక్రవారంపొలానికి నీళ్లు వదిలి మోటార్లు కట్టివేసి ఇంటికి వెళ్లామని తిరిగి శనివారం ఉదయం వచ్చి చూసేసరికి మోటార్లు విప్పదీసి దొంగిలించారని వాపోయారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రైతులు ఇద్దరూ ఫిర్యాదు చేశారు.

### ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు ఉద్దేశించి మాట్లాడుతూ పంట మార్పిడితో రైతులంతా అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. వేసవిలో పంట పొలాలలో నవధాన్యాల సాగు ద్వారా భూమిలో సారవంతం పెరగడంతో పాటు రైతులకు లాభాలు ఆర్జించవచ్చని వివరించారు. ప్రతి రైతు వేసవిలో పంట పొలాన్ని ఖాళీగా ఉంచకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ప్రత్తిపాడు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదుతో పాటు బంగారాన్ని దొంగిలించిన ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన అచ్చన భూలక్ష్మి శుక్రవారం ఇంటికి తాళాలు వేసి, తాళం చెవులను బయట మంచంపైనున్న దిండు కింద ఉంచి పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేప్పటికి, ఇంటి తలుపు తాళాలు తెరిచి ఉండటంతో పాటు బీరువాలో ఉండవలసిన రూ. 20 వేలు, మూడు గ్రాముల బంగారు ఉంగరం కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని శనివారం భూలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటోను ఢీకొట్టిన ఘటనపై కేసు

ప్రత్తిపాడు: ప్రయాణికులతో వెళుతున్న ఆటోను గుర్తుతెలియని కోళ్ల బండి ఢీకొట్టిన ఘటనపై ప్రత్తిపాడు పోలిస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం మేడావారిపాలెం గ్రామానికి చెందిన కారుమూరి వీరయ్య ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 20వ తేదీన ప్రత్తిపాడు నుంచి మేడావారిపాలెం గ్రామానికి ఆటోలో ఐదుగురు ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నాడు. ప్రత్తిపాడు గ్రామశివారులో నూతనంగా నిర్మిస్తున్న కోల్డ్ స్టోరేజీ సమీపంలో గుర్తుతెలియని కోళ్ల ఫారానికి చెందిన బండి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు ఆటోడ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తు డాబాపై నుంచి జారిపడి తీవ్రగాయాలతో చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం హౌసింగ్ బోర్డు కాలనీ సంస్కృతి అపార్ట్‌మెంట్‌లో కొండ ఉదయ ఫణి రామకిషోర్(34) నివసిస్తూ ఉంటాడు. ప్రతి రోజు సాయంత్రం అపార్ట్‌మెంట్ పైన వాకింగ్ చేస్తుండేవాడు. శుక్రవారం రాత్రి వాకింగ్ చేస్తుండగా అపార్ట్‌మెంట్ పైనుంచి జారి పడ్డాడు. తలకు గాయం కావడంతో బంధువులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### డివైడర్‌ను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న సుభాని

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన షేక్ సుభాని శనివారం ఇన్నర్ రింగ్‌రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళుతూ విజయ డిజిటల్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో సుభాని తీవ్రగాయాలపాలవ్వటంతో స్థానికులు అతనిని 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు సుభాని పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. సంఘటనపై యువకుడి తండ్రి ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ద్విచక్ర వాహనాన్ని వదిలి వెళ్లిన అగంతకులు



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం ప్రధాన రహదారిలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని వదిలి వెళ్లిపోయారని స్థానికులు శనివారం తెలిపారు. గత కొంతకాలంగా ఈ ద్విచక్ర వాహనం ఇక్కడే ఉంటోందని, ఎవరూ ఈ వాహనం తీసుకు వెళ్లడానికి రావడం లేదని హీరోహోండా కరిష్మా తెల్ల రంగు ద్విచక్ర వాహనాన్ని పోలీసులు తీసుకు వెళ్లాలని కోరినట్లు షాపు యజమాని పేర్కొన్నారు. పోలీసులు నేటికి కూడా ఆ ద్విచక్ర వాహనాన్ని తీసుకు వెళ్లలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### యువకుడి అదృశ్యం



కగ్గా సూర్యగోపాల్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ఒకటవ లైన్‌లో చెందిన యువకుడు కనబడడం లేదంటూ తండ్రి శనివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. పట్టణ పరిధిలోని మహానాడు 1వ లైన్‌లో నివాసముంటున్న కగ్గా కామేశ్వరరావు కుమారుడు కగ్గా సూర్యగోపాల్(యోగి), వయస్సు 15 సంవత్సరాలు, 10వ తరగతి పరీక్షలు రాసాడని, ఈ నెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు.